# జపమాల

డా॥ వి.వి.బి. రామారావు

తూర్పున వెలుగురేఖలు పూలమొక్కలమీద తెల్లబారుతున్నాయి. నందివర్ధనం విరగబూసింది. పూలు విరుతుండగానే చెట్టు ఆకు వచ్చరంగు ప్రస్ఫుటంగా కనబడింది - ఏదో తెర లేసినట్టు. అంతరంగంలో ఏదో తలుకుమన్న ట్టనిపించింది శివయ్యకి.

నజ్జలో పూలతో పూజా మందిరంలోకి వచ్చారు. దేవుడి తిన్నెమీద తోమిన రాగి పంచపాత్ర ఖణీగా కనబడింది.

పూజకు కూర్చోబోతూ దైవాన్ని మరోసారి తలుచుకున్నాడు. చీకటికి కారణభూతమైన తెరలను కనబడకుండానే తనే తొలగిస్తూ తనూ అవిర్భూతమయ్యాడు సూర్యభగవానుడు.

వెలుగుతో గది నిండి నట్టనిపించింది. దీపారాధన జరిగింది. నుదుట బొట్టు.

"అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతో పివా యస్మరేత్ పుండరీ కాక్షం..."

తరువాత సంకల్పం. పూజా కార్యక్రమం మొదలైంది. ధ్యాన శ్లోకాలు మనసులో ఏవో వెలుగును నింపుతున్నాయి

"నమ స్సోమాయచ రుద్రాయచ నమస్తా మ్రాయ చారుణాయచ... శంచమే యమశ్చమే ప్రియంచమే ;ను కాయశ్చమే సౌమన నశ్చ మె భద్రంచమె..."

అర్చన చేసిన పూల మధ్య నుంచి అమాయకమైన కళ్ళు తనవంకే చూస్తున్నట్లనిపించాయి. ఆ కళ్ళలో పవిత్రత. ఏదో ఆత్మీయత. ఎందుకో అనపాయత. వెనక శక్తిస్వరూపిణి పటం.

శివయ్య పూజ ముగించడానికి చాలాసేపు పట్టింది. వసారాలోకి వచ్చి పేపరు తీసుకుని పేజీలు తిరగేస్తుంటే వంటావిడ కాఫీ గ్లాసు పట్టుకొచ్చింది.

"రెండు రోజులై రామస్వామి తమకోసం కబురు పెడుతూనే ఉన్నాడు. పాపం మంచం దిగలేని అవస్థ. ఒకసారి చూసి పొమ్మని విన్నవించుకుంటున్నాడు" అంది వంటావిడ.

"సీతాయమ్మ సెలవలైపోయాయా?" శివయ్య పరధ్యానంగా అడిగాడు.

"వెళ్ళిపోయి మూడు రోజులైనట్టుంది. తమకు చెప్పి వెళ్ళిందేమో."

"నాకు చెప్పనక్కరలేదనే చెప్పాను. నే రామస్వామిని చూసి వస్తా." శివయ్య కండువా భుజాన వేసుకుని మాలి ఇంటి వంక నడిచాడు.

సుమారు ఎకరం స్థలంలో మధ్య ఉన్న విశాలమైన లోగిలి. పడమటి హద్దులో రెండు గదుల పెంకుటిల్లు. అందులోనే రామస్వామి గత పాతికేళ్ళుగా ఉంటున్నాడు. తండ్రి తరవాత మాలి ఉద్యోగంలో రామస్వామి స్థిరపడిపోయాడు.

మామిడి చెట్టు దగ్గర ఎందుకో ఆగిపోయారు శివయ్యగారు.

"బాబూ ! బాబూ ! దరమపెబువులు..." రామస్వామి భార్య ఆక్రోశిస్తూ అక్కడే ఇరవై రెండేళ్ళ క్రిందట తన కాళ్ళమీద పడిపోయింది. "నిండు గుండె - నిడివి మనసు. సేసేతులా పేనం తీసుకుని పిసాచాన్ని కాలేను. బతికి దేవుడంటి నా మడిసి ముకం సూడనూలేను... తండ్రి వంటివారు."

సరిగా అదే మామిడి చెట్టు - అలాగే ఉదయం. ఆ రోజూ ఇలాగే పూజ ముగించుకుని తోటలో తిరుగుతుంటే రత్తి తన కాళ్ళను చుట్టేసుకుంది.

అప్పటికే సుమారుగా భగవంతుడు స్పష్టం చేసేశాడు తనకి సంతానయోగం లేదని. నోచుకోని భాగ్యం ఎలా వస్తుందని ఉస్సురంది రమాదేవి - పోనీ తన తమ్ముడైనా స్థిరుడై ఒక బిడ్డను కంటే అదే పదివే లనుకుంది. నట్టింట్లో బిడ్డ ఆడుకుంటూ ఉంటే తను యశోదాదేవి లాగే ముచ్చట పడగల నంది.

శివయ్యగారి ముఖం జేవురించింది...

డబ్బు సంపాదించడంలో కష్టం - మంచి విలువా తెలియని కాశీపతి అక్క ఇచ్చిన అలుసు తీసుకుని కనీసం తన కంట పడకుండా తప్పించుకుని నానా తిరుగుళ్ళూ తిరుగుతున్నాడు. ఆ రోజే అనిపించింది - వాడికి బ్రతికే యోగమూ, తమకి సంతానయోగమూ ఈ రెండూ లేవని.

"నా కళ్ళారా చూశాను. ఇక వాడిని ఇంటి నుంచి వెళ్ళగొట్టడం కంటే మార్గం లేదు. పాపం రత్తి - మైకంలో అఘాయిత్యం చేశాడు. కేక లందినా ఆడకూతుర్ని నేనేం చెయ్యను? బుద్ధి చెప్పడానికి ప్రయత్నం పదేళ్ళయి చేస్తూనే ఉన్నారు. ఇక వాడిలో మార్పు రాదు. ఇక వాడిని ఇంటిలోంచి బయటికి పంపడమే శరణ్యంలా ఉంది. మిల మిలలాడింది ఆడకూతురు. దాన్ని ఏమని ఓదార్చాలి? మీ నిబ్బరం నాకు లేదు. ఏమి టీ క్షోభ? ఏమిటి మన దారి?"

బావురు మంది రమాదేవి.

"ఏదీ మన చేతుల్లో లేదు. అలాగని ఏం చెయ్యకుండానూ ఉండలేం. తెలిసి చేసినా, తెలియక చేసినా చేసినదానికి ప్రతిఫలంలో మార్పు ఉండదు. రామస్వామి పొలానికి వెళ్ళాడుగా. పద వెళదాం. ఆ ఆడకూతుర్ని చూసి వద్దాం..."

"వద్దు ! ఆ పని నేను చెయ్యలేను. దానికి నా ముఖం చూపించలేను. కాటేస్తుందని తెలిసి పాముని ఉపేక్షించాను. తీరా కాటేసిన తరువాత ఏం మాటలు చెప్పి ఏం ఓదార్చి ఏం లాభం?"

మూడు రోజులు తిరగకుండా వాడు చేసిన అఘాయిత్యానికి శిక్ష పడనే పడ్డది. మోటారు సైకిలు నుగ్గయిపోయింది. లారీ కింద నుంచి కాశీపతి శవాన్ని తీసి సావిటి గుమ్మంలో పడేశారు.

రమాదేవి కంట్లో నీళ్ళు తిరగలేదు. గుండె మాత్రం చిట్లినట్టనిపించి వెంటనే స్పృహ తప్పిపోయింది. రామస్వామి ఆమె ముఖాన నీళ్ళు చల్లి శీతలోపచారాలు చేశాడు. ఎక్కడ నుంచో రత్తి ఏడుపు సన్నగా వినవస్తోంది.

నెల రోజులు తిరిగాయో, లేదో - రమాదేవి "నా కోరిక తీర్చరూ?" అంది.

ఎన్నోసార్లు విన్న కోరికే అది.

పూజా మందిరంలో జపమాల తిప్పుతూ ఉంటే తనని ఎవరో తట్టి లేపి నట్టయింది.

"నువ్వూ వస్తావా? నీ కోరికను నేను తీర్చడానికి కావాల్సిన ధైర్యం నాకు ఆ భగవంతు డిచ్చాడు. ఇప్పుడే బయలుదేరుతున్నాను."

ముందు రమాదేవి తెల్లబోయినా వెంటనే లేచి చేతిపెట్టెలో రెండు జతల బట్టలు సర్దింది.

"భగవంతుని అనుగ్రహం మన ఎడల ఎప్పుడూ ఉంటుంది" అంది రమాదేవి.

ఆ ముఖంలోని వెలుతురే తనని ఈనాడూ ముందుకు తీసుకు వెళుతోంది. పట్నం నుంచి తెచ్చుకున్న బిడ్డకి 'రమానాథ్' అని పేరు పెట్టమన్నదీ రమాదేవే. 'శర్మ' అని మాత్రం తను చేర్చాడు. మూడేళ్ళదే ముచ్చట. ముచ్చటైన బిడ్డ ముంగిట్లో ఆడుకుంటూ ఉంటే రమాదేవికి జీవనగమ్యం చేరి నట్టనిపించింది.


"ఇక నే నేమైనా ఫరవాలేదు... దత్తహోమం జరిపించాం కదా" అంది-

ఆమె ముఖంలో ఏదో వెలుగు. నుదుట ఆ గుండ్రని కుంకుమబొట్టు లోంచి ఏదో శక్తి తన మనసులోకి ప్రవహిస్తున్నట్టు ఉండేది.

"ఏమిటండీ అలా చూస్తారు... నేనే రమాదేవిని."

"ఆఁ !" తను ఉలిక్కిపడేవాడు.

"దరమ పెబువులు... సేజేతులా పేనం తీసుకోనేను... ఆ రోజే సుయ్యో గొయ్యో



నూసుకునుంటే. అయ్యయ్యో నా దేవు డేమైపోతాడని కాలు సేతు లాడలేదు. ఈ రోజు ఆ దేవుడిది కాదని తెలిసీ ఈ బరువును మోత్తన్నాను. నా పాపానికి శిచ్చేటి బాఁవూ? ఈ బతుకు తెల్లారడమెలా?''

మావిడి చెట్టు కింద రత్తి తన పాదాలు కన్నీళ్ళతో అభిషేకం చేస్తోంది.

ఆమె నుదుట ఉన్న బొట్టు దైవశక్తికి ప్రతీకగా జిగ్గున మెరిసిపోతోంది.

"రత్తీ. నువ్వు నాకు భగవంతు డిచ్చిని చెల్లెలివి. నీ బిడ్డకి ఏ లోటూ రాదు. రామస్వామి సంతోషాన్ని ముక్కలు చెయ్యకు. నువ్వు తప్పు చెయ్యలేదని నాకూ, రమకే కాదు - ఆ భగవంతుడికీ తెలుసు. మనుమల ప్రయోజకత్వానికి మేరలేదు అనుకోవడం అవివేకం. ధైర్యంగా ఉండు! రమాదేవే నాకు జరిగిన అఘాయిత్యం గురించి చెప్పింది. నువ్వు పూలు తెస్తే కానీ నేను పూజకి వెళ్ళేది లేదు. నన్నూ ఆ భగవంతుడి సేవకి పంపగలిగేది నువ్వే. నీ శాపం మాత్రం ఎవరికీ తగలనివ్వకు.''

రత్తి భోరున ఏడ్చింది. కాశీపతి అకాల మృత్యువుకి కారణం - ఏమీ తెలియని మూర్ఖురాలు - తన శాపమే కారణమని బుగత నమ్మకమా? తను అంత శక్తి ఉన్నదైతే తనని తను ఎందుకు రక్షించుకోలేకపోయిందీ. రమాదేవమ్మగారు తనకి మొక్కుతుంటే తన కెందుకూ ఆ గగుర్పాటు !


"పెద్దోళ్ళు తల్లా... నా కేల మొక్కుతారు? మీ కాళ్ళకాడ పడుండే ఓల్లం అలా సెయ్యమోకండి తల్లా.''

"లేదు రత్తీ. నువ్వు దేవివి. నువ్వు ఎర్రగా చూస్తే మేం బుగ్గయిపోతాం. చేసిన పాపానికి వాడు బలైపోయాడు. నిప్పుగుండంలో దూకి ఎవరయినా నూకలు మిగుల్చుకోగలిగారా? మమ్మల్ని చల్లగా చూడు రత్తీ. నువ్వు కులదేవతవి. నా ఆడబిడ్డవి'' అంటూ చేతులు పట్టుకుంది రమాదేవి.

రత్తి పూలు తెస్తూనే ఉంది. రమాదేవి అందుకుంటూనే ఉంది. జపమాల యథావిధిగా తిరుగుతునే ఉండేది-

రామస్వామి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. "భగవంతుడు మా పాలి టున్నాడు. తమ పూజల్లో రత్తి కోసిన పూలూ ఉన్నాయి. పున్నెమంతా రత్తిదే. కాదు - ఆ భగవంతుని దయ. బాఁవూ. మాకు బిడ్డ నిత్తన్నాడు. ఆడికి తమ పేరెట్టుకుని పెంచుకుంటాం. దరమపెబువులు.''

వాడి ఆనందం, ముఖంలోని వెలుగు - కళ్ళలోని నమ్మకం - అది చూస్తున్న రమాదేవి ముఖంమీద బొట్టులో అరుణిమ రెండూ ఒకే



కాంతిలో చల్లగా - నిమ్మళంగా, హాయిగా చందమామ వెన్నెల్లా కనపడేవి.


శివయ్యగారి మనసులో ఏదో అనుభూతి కలిగి ముఖంలో మందహాసం మెరిసేది.

పట్నంలో ఆస్పత్రిలో ఉంది పురిటికి వెళ్ళిన రత్తి. పురుడు వారం రోజుల్లో వస్తుందన్నారు డాక్టర్లు.

"బాబూ ! భగవంతు డేల నా కీ శిచ్చ ఏసినాడు? అది నేకుండ ఈ పురిటిగుడ్డుని ఎలా సాకేది తండ్రీ !" వరిగెట్టుకొచ్చి బావురుమన్నాడు రామస్వామి.

శివయ్యగారి గొంతు ఆర్ద్రతతో పూడుకుపోయింది.

"అంత శివాజ్ఞరా అబ్బీ ! కన్ను మూసిన నీ భార్యనైతే ఎవరూ తీసుకురాలేరు గానీ... ఆ బిడ్డకేం లోటూ రాకుండానే చూసుకుంటారా. భగవంతు డిచ్చాడు మన కీ బిడ్డని. మన లోగిట్లో ఆడపిల్ల లేనిలోటు ఇలా భర్తీ చెయ్యా లనుకున్నాడేమోరా ఆ దయామయుడు !" అంది రమాదేవి.




ఆమె వంక చూడకుండానే శివయ్యగారు - "ముందు పసిగుడ్డు కో పాల తల్లిని వెదుకు" అంటూ ఉండగానే "నా అడదా న్నడిగి సెబుతా బాబయ్యా తమ రుణం తీర్చుకోడానికి ఇదో వద్దతే" అన్నాడు పాలేరు.

పురిటిగుడ్డకి సీతాయమ్మని పేరు పెట్టింది రమాదేవి.

సీతాయమ్మ రెండు గదుల పెంకుటింట్లో పెరిగింది.

** ** **

"అయ్యగారూ, అయ్యగారూ ! తమ కో శుభవార్త"

"ఏమిటమ్మా అది? మొన్ననేగా చెప్పావ్ ముదటి శ్రేణిలో ఉత్తీర్ణురా లయ్యావని ! ఇంకా శుభవార్త ఇంత వేగం ఏమిటబ్బా?"

"లేదం డయ్యగారూ..."

"చూడు సీతాలూ నీ కెన్నిసార్లు చెప్పాను. ఆయన్ను అయ్యగారని పిలవద్దని" అంది రమాదేవి.

"పిలవకపోతే అయ్య కోప్పడతా డు..."

"ఫరవాలేదమ్మా. నన్ను అత్తయ్యా అని పిలువమ్మా. మావయ్యా అని పిలువు ఆయన్ని. కాలూ, చెయ్యీ పడిపోయి బ్రతికి నన్నాళ్ళు ఎల్లానూ బ్రతకను. వాడు డాక్టరయితే వాడి చేతిమందు పుచ్చుకోవాలనే కాబోలు ఆ రోజు కోసం ఇలా చూస్తూ ఉన్నాను."

"ఉండవోయ్ ! అలా ఎందు కనుకుంటావ్ ఏ ఎనభయ్యో, తొంభయ్యో వచ్చాయా. ఈ రోజుల్లో అరవై ఏళ్ళకి పెళ్ళికూతుళ్ళూ ఉంటున్నారు. సీతాలూ, చెప్పమ్మా."

"నే సెబుతా బావూ, అ దేదో రేంకంట. వదహా రొచ్చిందంట. ఏదో ఏను గెక్కినట్టు సంబరపడిపోతంది బొట్టి. కాని బాబూ. డాక్టరీ నదువంటే సామాన్నెవా? నా నేటి, నా బతుకేటి? ఆ కాడికీ మీ దరమవా అంటూ ఇంతదాన్ని సేసినాను... నా కేటో నాగుంది... ఓ అయ్య సేతి లెట్టిస్తే నా కిక కోరిక నే టుండవ్."

రమాదేవి వింటోంది. ఆమె కంటిముందు ఎందుకో తమ్ముడి కళ్ళు కదలాడాయి - 'అక్కా. ఇది నా బిడ్డ. నువ్వూ, బావే దీనికి దిక్కు...'

"చదువుకోవాలే కానీ డబ్బు గురించి నువ్వేమీ ఆలోచించకు రామస్వామీ. అబ్బాయి పుస్తకా లెటూ ఉన్నాయి. ఇంతకీ ఇద్దరూ ఒకే దగ్గర ఉంటే ఆడపిల్ల దూరంగా ఉందనే దిగులుండదు." "నా కొదిలెయ్ ! అబ్బాయికి ఉత్తరం రాసి నే తెప్పిస్తా." రమాదేవి చెప్పేసింది.

** ** **

"ఏవండీ... సీతాయమ్మ నా మేనకోడలండీ. దాన్ని... దాన్ని"

"నీ మనసులో మాట నాకు తెలియనిది కాదు రమా. ముప్పై ఏళ్ళ దాంపత్యం. నీ ముఖమే నీ ఆలోచనని తేటతెల్లం చేసేస్తుంది. ఆ బొట్టు అదీ దేవీ కటాక్షం. ఆవిడ తలుచుకుంటే నీ కోరిక తప్పక నెరవేరుతుంది."

** ** **

"బావా !"

"ఓ నువ్వా సీతాలూ. బావా అని ఎవరు పిలిచారా అని ఆశ్చర్యపోయాను." ముఖం చిట్లించుకుని అన్నాడు రమానాథ్ శర్మ.

"క్షమించాలి చినబాబుగారూ. అమ్మగారు అలా పిలవమంటే పిలిచా. ఇంకెప్పుడూ పిలవను."

"ఏదో వెర్రిబాగులది అందే అనుకో. జ్ఞానం వచ్చి మనం..."

"క్షమించండి." తల తిప్పుకుని వెళ్ళిపోయింది సీతాలు.

మంచంమీద ఉన్న రమాదేవి సీతాలు పిలుపే వింది. మళ్ళీ మగతలోకి జారిపోయింది పెదవుల మీద చిరునవ్వుతో.

** ** **

"ఓమ్ త్ర్యయంబకం అజామహే - సుగంధిం పుష్టివర్ధనం - ఉర్వారుక మివ బంధనాత్ - మృత్యోర్మో క్షీయ మామృతాత్ !"

దీపపుకుందిలో ఆవు నేతితో తడిచిన వచ్చటి వత్తి నిటారుగా వెలుగుతోంది. తోమిన వెండి వళ్ళెంలోని నందివర్ధనాలు మిల మిలలాడుతున్నాయి. పూజా మందిరంలో దివ్య సౌరభాలు మనస్సుని ధ్యాననిష్ఠలో అలౌకిక అనుభూతుల నిస్తోంది. మృత్యుంజయ జపం జరుగుతుంది.

శర్మ పెదవులు కదలడంలేదు. రమానాథ్ శర్మ చేతిలోని జపమాల దీక్షగా ఏకాగ్రతతో ముందుకు జరుగుతోంది.

కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతున్నారు శివయ్యగారు. అభిషేకం పూర్తయ్యేటట్లు లేదు. ఆమె కొన ఊపిరితో ఉంది.

"అబ్బాయి" అని మెల్లగా పిలవకుండా ఆగలేకపోయారు. మడి ధోవతి మీద ముడుచుకున్న జరీలా ఆయన వృద్ధాప్యంతో వడలిపోయారు.

"అబ్బాయ్ !"

శర్మ కళ్ళు తెరుచుకున్నాయి.

"అమ్మ..." ఆయన ఏం చెప్పాలో తెలియక ఆగారు.

"వస్తున్నా." జపమాలతోనే ఆయన వెంట శర్మ గదిలోకి వెళ్ళాడు.

"అబ్బీ. నే వెళుతున్నా. నాన్నగారి మాట..." ఏదో అస్పష్టంగా చెప్పిన రమాదేవి కళ్ళలోని వెలుగు చటుక్కున మటుమాయమైంది.

"అమ్మగారూ !" అంటూ సీతాయమ్మ ఆవిడ కాళ్ళమీద పడింది.

"శివాజ్ఞ !" నీళ్ళు నిండిన కళ్ళను మూసుకున్నారు శివయ్యగారు.

జానతో దర్భలు కొలవడమూ, పిండాన్ని ఎత్తిపెట్టడమూ అయ్యాయి. రమాదేవి చనిపోయిన చోట దీపమూ తీసివెయ్యడమూ జరిగింది. సమారాధనా జరిగింది.

"అమ్మ మాట నీతో చెప్పాల్సిన బాధ్యత ఒక్కటే నాకు మిగిలింది" అన్నారు శివయ్యగారు.

"నాన్నగారూ !"

"చదువుకున్న వాడివి. డాక్టరు కాబోతున్నవాడివి. చాదస్తాలు మాటకేం కాని. కాలయాపన చేయడానికీ వీలులే దనిపిస్తోంది."

"నాన్నగారూ !"

"మా చాటున పెరిగిన బిడ్డవి" అలా అంటూ ఉంటే ఆయన పెదవులమీద ఒక దరహాసం తళుక్కుమనడం రమానాథ్‌శర్మ గమనించకపోలేదు.

"కొత్తగా మాట్లాడుతున్నారు?"

"కొత్తకి మానవ జీవితంలో ఏం మిగల్చకుండా చేసేశారు మన పూర్వీకులు. మతం మనుమలని ఒకటిగా చేసే మార్గాలనే నిర్దేశించింది. దాన్ని పాటించడం సాంప్రదాయం. కులమూ, మతమూ, శాస్త్రమూ, సాంప్రదాయమూ సంఘాన్నీ వ్యక్తినీ ఋజుమార్గంలో నడిపించి మానవత్వం మీద నమ్మకాన్ని పెంచుకోడానికే.

అది తెలుసుకోవడమే సంస్కారం. అది చదువుతో నిమిత్తం లేనిదీ, జీవన విధానంలో స్ఫుటంగా కనపడేదీ."

"మీ మాట నే నెన్నడూ కాదనలేదనే నా విశ్వాసం - మనసా, వాచా, కర్మణా మీరు చెప్పినట్లు చెయ్యడమే నాకు తెలుసు."

"అలా చెయ్యడానికి నీ మనసు ఒప్పుకోని పనేమైనా చెప్పవచ్చేమో !"

"అలాంటి పని చెయ్యమని చెబుతారని నేను నమ్మను."

"నీ నమ్మకం నాకు కొంత ధైర్యాన్నిస్తోంది. కాలాతీతం కాకుండానే ఆ మాట చెప్పడం నా విధి. ఘడియ మనది కాదన్నది మన వాళ్ళ సూక్తి..."

"అమ్మ ఏమైనా చెప్పిందా?"

"చెప్పకుండా తెలుసుకుంటావనే అనుకుంది. నువ్వు తెలుసుకున్నావో, లేవో నాకు తెలియదు."

రమానాథ్ శర్మ ఆయన వంక చూశాడు. ఆ కళ్ళలో వెలుగునే తను ఎరుగును. ఆ వెలుగుల మధ్య నీడలూ దోబూచు లాడుతున్నాయి.

"నువ్వు ఈ మాటలు ఇప్పుడు అనవసరం అని అంటావని నాకు తెలుసు. కాని మనసులో మాట మనసులోనే ఉంచుకుని నీకు చెప్పకుండానే నేను..." శివయ్యగారు రమానాథ్ శర్మ కళ్ళలోకి చూడక తప్పలేదు.

"నే వింటున్నాను నాన్నగారూ !"

రెండు జతల కళ్ళూ కలిశాయి.

ఒక్క క్షణం నిశ్శబ్దం.

"నీ వివాహం సీతయమ్మతో జరిపించాలని మీ అమ్మ కోరిక."

"నాన్నా ! ఏమిటి మీ రంటున్నది? సీతయమ్మ ఎవరు? మన మెవరు? నిత్యాగ్నిహోత్రులు, పరమ నిష్ఠలు మీరు... మీరు..."

"జాతులు మనం కల్పించుకున్నవయ్యా. మనం శ్రోత్రియులమని మీ అమ్మ మరిచిపోయిందని నే ననుకోను. ఆమె కోరిక అది. చెప్పాల్సిన బాధ్యత మిగిలిపోయిందని నాకు తెలును. చెప్పాను. ఆమె కోరికను నువ్ తీర్చడమా లేక తిరస్కరించడమా నీకే వదిలిపెడుతున్నా. నా మనసు బాధ నాది. కొన్ని ప్రశ్నలకి జవాబులు దొరకవు. ప్రశ్నలు మన మనసులోకి వచ్చినా వాటికి సమాధానాలు చెప్పే మనుషులూ ఉండరు... చెప్పగలిగినా చెబుతారని చెప్పడం కష్టం. నే జపానికి వెళుతున్నా."

సీతయమ్మ తనని 'బావా' అని పిలవడం, తనేమో ఆమెను మందలించడం రమానాథ్‌శర్మ కళ్ళ ముందు మెదిలాయి.

కాని, కాని అమ్మ ఇలా ఎందు కనుకుంది? ఇలా ఎందుకు కోరుకుంది? కోరుకుందని తెలిసినా అమ్మ ఉండగానే నాన్నగారు ఎందుకు చెప్పలేదు?

రమానాథ్ శర్మ తలలో ప్రశ్నలు.

"పెదబాబుగారు..."

రమానాథ్ శర్మ తన వంక చూస్తుంటే సీతయమ్మ తల దించుకుంది.

"రమ్మన్నారు బాబూ."

"చూడు సీతాలూ... నన్ను నువ్ బాబూ అని పిలవద్దని చెప్పాను."

సీతాలు ముఖం ఎరుపెక్కి పెదవులు వణికాయి.

" 'బావా' అని పిలవద్దని మాత్రం జ్ఞాపకం ఉంది."

ఆమె కళ్ళు ఎత్తి చూసింది. రమానాథ్ శర్మ బయట వచ్చని తులసి మొక్కవంక చూస్తున్నాడు.

"అమ్మకి ను వ్వంటే గారం కదూ !"

"ఆవిడ కెవరంటే గారం లేదు?"

"నాకంటే నువ్వే ఆవిడకు అప్తురా లనిపించేది."

"ఆవిడ మనసు పెద్దతనం అది. నా భాగ్యం."

"అమ్మ నీతో ఏమైనా చెప్పిందా?"

"పెదబాబుగారు కబురంపారని దిగ్గున లేచి వచ్చాను."

"పూజలోకి వెళ్ళారు."

"అయ్యో పొలానికి వెళతా నన్నాడు. ఒక పది నిమిషాలలో వస్తా నని చెప్పా. మళ్ళీ వస్తా."

రమానాథ్ శర్మ వద్దని చెప్పలేదు. ఆమె వెళ్ళిపోయింది. తులసి మొక్క, గన్నేరు మొక్క, బాదం చెట్టూ, దూరంగా మామిడి చెట్టూ, ఆకు ఆకుల సందులూ కళ్ళు వెదికేస్తున్నా రమానాథ్ శర్మ మనసులోని ప్రశ్నలకి సమాధానం దొరకడం లేదు.

లోపల శివార్చన ముగింపుకు వస్తూండాలే. ఎందుకో కంగారు పుట్టింది.

లోపలికి వెళ్ళాడు రమానాథ్ శర్మ.

శివయ్యగారి కళ్ళు మూసుకునే ఉన్నాయి. పెదవులు కదలడం లేదు. జపమాల ముందుకు జరుపుతున్నాయి తేణకని వేళ్ళు.

అలా నుంచునే ఉన్నాడు.

"పెదబాబూ... పెదబాబూ..." సీతయమ్మ గొంతు వసారాలోంచి వినబడుతోంది.

గొంతయితే వినబడుతోంది. జపమాల జరుపుతున్నా వేళ్ళు తన కళ్ళని పక్కకు తిరగనియ్యకుండా ఆరడి చేస్తున్నాయి.

"బాబూ..." మెల్లగా అంది ఎప్పటినుంచో అలాగే నుంచున్న సీతయమ్మ.

"సీతా !" రమానాథ్ మెల్లగా అన్నాడు కళ్ళను తిప్పకుండానే.

"హర హర మహాదేవ !... హర హర మహాదేవ హర హర మహాదేవ !" మెల్లగా ప్రాణంతరాల్లో వినవచ్చాయి మాటలు.

జపమాల కదులుతూ కదులుతూ ఆగింది. ఒక్క క్షణం శివయ్యగారి శరీరం కదిలినట్లు కదిలి నేలకి ఒరిగిపోయింది. జపమాల వేళ్ళ మధ్య అలాగే ఉండిపోయింది.

*

## ముల్లు

గవర్నమెంటు డాక్టరు పేషెంటుని ఇలా క్షోప్పడ్డాడు-"కాళ్లో ఇన్ని ముళ్ళు గుచ్చుకునేదాకా ఏం చేస్తున్నా వయ్యా?"

"ముల్లును ముల్లుతోనే తీయాలనే ప్రయత్నంలో ఇలా జరిగిపోయింది సార్" అన్నాడు పేషెంటు నీరసంగా.

హోటలు ముందు నోటీసు బోర్డు ఇలా ఉంది. "ఈ హోటల్లో ఎలక్ట్రిక్ రుబ్బురోలు ఉన్న కారణాన డబ్బు లిచ్చుకోలేని కష్టమర్లు కరెంటు లేని టైములో పిచ్చేయ ప్రార్థన.

ఇట్లు
హోటల్ యాజమాన్యం"

శిరం వెంకటరామకృష్ణ [కంకిపాడు]

